క్లుప్తంగా

ప్రత్యేకాధికారికి సన్మానం



లోకనాథంను సన్మానిస్తున్న దళిత సంఘం నాయకులు

సారవకోట: మండల ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎం.లోకనాథంను స్థానిక కమ్యూనిటీ భవనంలో మండల దళిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. పశుసంవర్ధక శాఖ ఏడీగా విధులు నిర్వహిస్తున్నారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం దళిత సంఘం సమావేశాలు నిర్వహించుకుంటున్న భవనానికి విద్యుత్ సరఫరా, రక్షణ గోడ, బోర్‌వెల్, మరుగుదొడ్లు నిర్మించాలని, దళిత వాడలలో శ్మశాన వాటిక నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, దళిత సంఘం అధ్యక్షుడు గోకర్ల సింహాచలం, చిన్నప్పన్న, దాలయ్య, తొంప కిరణ్, ముడిదాన వెంకటరమణ, మజ్జి అప్పన్న, బూర చిలకయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరావుకు సత్కారం



తిరుమలరావును సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

కొత్తూరు: మండలంలోని పాతపానుటూరు ఎంపీయూపీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజాం రచయితల వేదిక సభ్యుడు కుదమ తిరమలరావును అనకాపల్లిలో శ్రీశ్రీ కళావేదిక సభ్యులు ఆదివారం సత్కరించారు. జాతీయ స్థాయి కవి సమ్మేళనాన్ని అనకాపల్లిలోని గౌరి గ్రంథాలయంలో నిర్వహించారు. అన్ని దిశలా నిర్భయ గుర్తులే అనే శీర్షకతో స్వీయ గీతాన్ని ఆలపించిన తిరుమలరావు అందరి మన్ననలను పొందారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమాదేవి, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.ఎన్.శాస్త్రి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు

ఆమదాలవలస: పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ రోడ్డు, గాంధీ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం ఏఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. పలువురు వాహనదారుల వద్ద రికార్డులు లేకపోవడంతో ఫైన్ విధించారు. గంజాయి రవాణాకు సంబంధించి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక విగ్రహం నిమజ్జనం



వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఎల్.ఎన్.పేట: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని మోదుగువలస వద్ద ఏర్పాటు చేసిన 25 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఆదివారం నిమజ్జనం చేశారు. వినాయకునికి పూజలు చేసిన చోటే ఫైర్ ఇంజన్ సహకారంతో నిమజ్జనం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ ఏడాది ఎత్తైన భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేస్తామని కమిటీ సభ్యులు వివరించారు. వినాయక విగ్రహాన్ని స్థానిక పెద్దలు డాక్టర్ మామిడి సాయి గణేష్, అంపిలి పోలినాయుడు, కోవిలాపు కృష్ణమాచారి, గుండపు రాము, వెలమల గోవిందరావు, గుండపు గణేష్ తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిట



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారుజామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేపట్టారు.



● అటెన్షన్ ప్లీజ్..

సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామ సచివాలయానికి వెళ్లే దారిలోని విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం పైపైన పాతడం వల్ల మట్టి పూర్తిగా కొట్టుకుపోయి ప్రమాదభరితంగా కనిపిస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఒరిగిన స్తంభానికి తాత్కాలికంగా కర్రను సపోర్ట్‌గా పెట్టారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

● పరిశుభ్రం



సారవకోట మండలంలో గల బుడితి సీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలను ఆదివారం తొలగించారు. ఆస్పత్రి ఆవరణ చుట్టూ మొక్కలు పెరగడంతో స్థానికులు కొంతమంది పశువులు కడుతుండటంతో సచివాలయ సిబ్బంది దీనిపై దృష్టి సారించారు. పంచాయతీ నిధులు వెచ్చించి సర్పంచ్ శంకరరావు ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు, పరిసరాల పరిశుభ్రం కార్యక్రమం చేపట్టారు.

- సారవకోట

● ఆర్థికసాయం



జలుమూరు మండంలోని చల్లవానిపేటకు చెందిన పట్ట శ్రీరాములు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అదే గ్రామానికి చెందిన మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం రూ.27,500 ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంపై మైత్రీ ఫౌండేషన్ ప్రతినిధులను పలువురు అభినందించారు. పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- జలుమూరు

జ్వరాల విజృంభణ



బుడితి ఆర్ఎంపీ దగ్గర చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

- గడపదాటని ఎంఎల్‌హెచ్‌పీలు
- గ్రామాల్లో ఆర్ఎంపీలే దిక్కు



చిన్నకిట్టాలపాడులో తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్

సారవకోట: ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో సచివాలయం స్థాయిలో వైద్య సేవలందించేందుకు.. సచివాలయానికి ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంను నియమించారు. వీరు గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించడం లేదు. ప్రజలు అందుబాటులో ఉన్న ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో పర్యటించి ప్రస్తుతం వస్తున్న వ్యాధులను గుర్తించి సంబంధించిన సమాచారాన్ని వారి పరిధిలో ఉన్న పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం అందజేయాలి. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి వారు సంబంధిత పీహెచ్‌సీకి, సచివాలయానికి రాలేని పక్షంలో వారి ఇంటికి వెళ్లి వైద్య సేవలందించాల్సి ఉంది. ఏ ఒక్కరూ ఆయా పనులు చేసే దాఖలాలు కనిపించడం లేదు. అదీకాక వివిధ రకాల వ్యాధులతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి టెలీమెడిసిన్ పద్ధతి ద్వారా అందుబాటులో ఉన్న వైద్యులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు మేరకు రోగులకు

మండలం	సచివాలయాలు	ఎంఎల్‌హెచ్‌పీలు
సారవకోట	20	20
నరసన్నపేట	22	22
పోలాకి	23	23
జలుమూరు	24	24

వైద్య సేవలందించాలి. వీరు సచివాలయాలలో కాలక్షేపం చేస్తున్నారే తప్ప.. వారికి కేటాయించిన విధులు నిర్వర్తించే దాఖలాలు కనిపించడం లేదు. వీరు సరిగా విధులు నిర్వర్తించకపోవడం, జ్వరాలు విజృంభిస్తుండటంతో మండలంలోని సారవకోట, అలుదు, బొంతు, బుడితి తదితర గ్రామాలలో ఆర్ఎంపీ వైద్యులను రోగులు ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదునుగా ఆర్ఎంపీలు ఇష్టానుసారంగా దండుకుంటున్నారు.

తీవ్రత అధికంగా ఉంది



వర్షాలు కురవడంతో గ్రామాల్లో జ్వరబాధితులు ఎక్కువగా ఉన్నారు. ప్రభుత్వ వైద్య సేవలు అంతంత మాత్రంగా ఉండటంతో ప్రజలు సమీపంలో ఉన్న ఆర్ఎంపీలు, ప్రవేట్ క్లినిక్‌లపై ఆధారపడుతున్నారు.


– గొర్లె ఢిల్లీరావు, మాజీ సర్పంచ్, పెద్దగుజ్జువాడ, సారవకోట మండలం

అధికారుల సమాచారంతో..

విస్తుపోయిన అర్జీదారుడు



బావి చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు


AD-GOVTAP
' ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
GANDIKOTA TRINADARAO గారు,
Grievance # SKL202407292815 తో నమోదు చేసిన మీ అర్జీని పరిష్కరించాము. మరిన్ని వివరాలను దయచేసి http://meekosam.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చు
ధన్యవాదములు –ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

త్రినాథరావు ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్

కొత్తూరు: మండలంలోని మదనాపురం పంచాయతీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన గండికోట త్రినాథరావు(అర్జీదారుడు)కు అధికారుల నుంచి వచ్చిన సమాచారం చూసి విస్తుపోయాడు. వెంకటాపురంలో రోడ్డుకు అనుకుని ఉన్న బావి ఆక్రమణలు తొలగించాలంటూ హైకోర్టులో త్రినాథరావు కేసు వేశారు. వాదనలు విన్న తరువాత బావి ఆక్రమణలు తొలగించి, బావికి చుట్టూ ఉన్న హద్దులు గుర్తించాలని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులకు కోర్టు ఆదేశించింది. ఆక్రమణలు తొలగించకపోవడంతోపాటు బౌండరీని నిర్ధారించకపోవడంతో ఈ ఏడాది జూలై 27న గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు త్రినాథరావు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలు బేఖాతారు చేయడంతోపాటు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు ఇచ్చి రెండు నెలలు కావస్తున్నా.. మండల స్థాయి అధికారులు స్పందించలేదు. చివరకు బావి చుట్టూ ఉన్న మొక్కలను తొలగించడంతోపాటు హద్దులు నిర్ధారించినట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి శనివారం అర్జీదారుడు త్రినాథరావు ఫోన్‌కు వచ్చింది. బావి వద్ద ఎటువంటి పనులు చేపట్టకుండానే ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌ను చూసి త్రినాథరావు నివ్వెరపోయాడు.

నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయానికి ముర్రాటలతో తరలివచ్చిన భక్తులు

హిరమండలం: వచ్చే నెల 3వ తేదీ నుంచి దసర శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభంకానున్న నేపథ్యంలో హిరమండలంలోని పెద్దకోరాడలో గల పాపతట్నం నీలమణిదుర్గ ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకులు దివాకర్ పండా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేశారు.అమ్మవారిని అలంకరించి శాంతి హోమం జరిపారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. లక్ష్మీగణపతి, షిర్డీసాయి మందిరం అర్చకులు బి.రవిబాబు, జె.గోవిందశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నీలమణిదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తమ్మినేని నియామకంపై హర్షం..

సరుబుజ్జిలి: మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకునిగా నియమించడంతో రానున్న రోజుల్లో పార్టీ మరింత పటిష్టంగా ఉంటుందని అఖిల భారత జాతీయ మానవ హక్కుల సంఘం జాతీయ సభ్యుడు రావాడ వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరి పట్ల సమదృష్టితో వ్యవహరించే తమ్మినేని సీతారాం వంటి సీనియర్ నేతకు పార్టీ అధిష్ఠానం పదవి అప్పగించడం వల్ల పార్టీకి మరింత మేలు జరుగుతుందన్నారు. ఎడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, సిరిపల్లి శ్రీనివాసరావు, గొండేల సింహాచలం, శంకరరావు, ఎండ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



గొనబుపేట-పారిశిల్లి రోడ్డులో తెలగవలస వద్ద ఏర్పడిన గొయ్యి

నరసన్నపేట: మండల పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారులపై ఆదమరిచి ప్రయాణం చేస్తే ఎక్కడో ఓ చోట గోతుల్లో పడక తప్పదు. మండలంలోని దేవాది–మబగాం గ్రామాల మధ్య మాకివలస పీహెచ్‌సీ ముందు ఆర్అండ్‌బీ రహదారిపై ఒక కల్వర్టు వద్ద రంధ్రం పడింది. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం తప్పదు. గునబపేట–పారిశిల్లి రోడ్డులో తెలగవలస వద్ద రోడ్డు పక్కన ఒక రంధ్రం ఏర్పడింది. దీనిపైన గడ్డి, జంగిల్ ఉంది. అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

సహారా డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

పాతపట్నం: సహారా డబ్బులు చెల్లించాలి సహారా కర్యకర్తల, ఖాతాదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొయిన సత్యనారాయణ, సభ్యులు సీహెచ్ నీలకంఠం, ఎన్.అప్పలనర్సయ్య అన్నారు. పాతపట్నం రామమందిరంలో సహారా కర్యకర్తల, ఖాతాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సహారా ఏజెంట్లు, ఖాతాదారులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొయిన సత్యనారాయణ మాట్లాడుతూ సహారా సంస్థ అక్రమ వ్యాపారం చేస్తోందని, కొన్ని బ్రాంచ్‌లు మూసివేసినప్పటికీ, మరి కొన్ని బ్రాంచ్‌లలో లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. కోట్ల మంది సహారా ఖతాదారులు ఆందోళన చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పోర్టర్ ప్రారంభించి ఆన్‌లైన్‌లో బాండ్‌లు పెట్టామని, సొమ్ములు ఇంతవరకు చెల్లించలేదన్నారు. పాతపట్నం, కొరసవాడతోపాటు పరిసర గ్రామాలకు చెందిన ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

చిన్నమల్లిపురంలో సత్యసాయి వ్రతాలు



సత్యసాయి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: మండలంలోని చిన్నమల్లిపురం గ్రామంలో ఉన్న సత్యసాయి మందిరంలో పాలకొండ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వ్రతాలు నిర్వహించారు. వ్రతాల్లో మహిళలు భారీగా హాజరయ్యారు. సత్యసాయి ప్రతినిధి ఎన్.వి.రమణ, దీప ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో చిన్నమల్లిపురం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఐసీడీఎస్ కొత్తూరు ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనురాధ, కె.వి.హేమలత డిమాండ్ చేశారు. మండలంలోని సుభలయలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు అనుగుణంగా సరిపడా సరుకులు సరఫరా జరగడంలేదని, వాటిని పూర్తి స్థాయిలో సరఫరా చేయాలన్నారు. అద్దె భవనంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల బకాయిలను చెల్లించాలన్నారు. కూరగాయలు, పోపుల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు, పాలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రజనీ, శ్రీలత, శ్రీదేవి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సిరువాడ రోడ్డు దుస్థితి

గోతులమయం

కొత్తూరు: మండలంలోని సిరువాడ రోడ్డు వర్షం కురిస్తే చెరువును తలపిస్తోంది. కొత్తూరు నుంచి సిరుసువాడ వరకు వెళ్లే ఈ రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. రాళ్లు తేలిపోవడంతో కనీసం నడవలేకపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

పరామర్శ..



దారపు శంకరరావును పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దారపు శంకరరావు తల్లి తవిటిమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ సేపాన అశోక్, జి.రామకృష్ణ, సాగర్, యుగంధర్, నాగరాజు, సతీష్, జగన్, తిర్లంగి కృష్ణమోహన్, నక్క వెంకటరావు ఉన్నారు.

ప్రహరీ నిర్మించరూ..



హిరమండలం శాఖా గ్రంథాలయం

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారి పక్కనే హిరమండలం శాఖా గ్రంథాలయం ఉంది. నిత్యం విద్యార్థులతోపాటు పాఠకులు వస్తుంటారు. అందుబాటులో ఉండే వివిధ రకాల పుస్తకాలు, పత్రికలు, ఇతర సమాచారాన్ని చదువుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రంథాలయానికి ప్రహరీ లేకపోడంతో ఆవరణం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పశువులు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రంథాలయాధికారి కె.ఎర్రమ్మ మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలను పూజిస్తున్న సూర్యారావు, చిన్నారులు

ఆమదాలవలస: ప్రతీ గ్రామంలో బడి, గుడి వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీసత్యసాయి సేవా సమిత కన్వీనర్ సూర్యారావు పిలుపునిచ్చారు. మండలంలోని అక్కులపేట, వేణమ్మపేట, మండాది గ్రామాల్లో బాలవికాశ్ ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా జన్మదిన వేడుకల దీక్షా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సత్యసాయి ప్రేమతరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని త్రినాథస్వామి ఆలయాలు, పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటారు. బాలవికాస్ గురువు సంజన, ఆమదాలవలస బాలవికాస్ చిన్నారులు, తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.